
దీపాలంకరణ.. అన్నదానం

గణేశ్‌ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లంబోదరునికి భక్తులు నిత్యపూజలు చేస్తున్నారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని వేడుకుంటున్నారు ప్రజలు. జిల్లాకేంద్రంలోని పలు వీధుల్లో సోమవారం రాత్రి దీపాలంకరణలు, స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. తెనుగువాడ గద్దివినాయకుడు, రంగంపల్లిలోని శివలింగం ఆకృతిలో దీపాలంకరణ ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


రంగంపల్లిలో దీపాలంకరణ


తెనుగువాడ గద్దివినాయకుని పూజలు

మంగళవారం । 26 । సెప్టెంబర్‌ । 2023

న్యూస్‌రీల్‌

రేపు గణేశ్‌ నిమజ్జనం


మాట్లాడుతున్న పోలీసులు, పురోహితులు

పెద్దపల్లిరూరల్‌: గణపతి నవరాత్రి ఉత్సవాల అనంతరం బుధవారం(ఈనెల27న) వినాయక నిమజ్జనం నిర్వహించాలని బ్రాహ్మణ సంఘం స్పష్టం చేసింది. సోమవారం స్థానిక ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకుడు కొండపాక శ్రీనివాసాచార్యులు వివరాలను వెల్లడించారు. భాద్రపద శుద్ధ చవితి రోజున గణేశ్‌ నవరాత్రోత్సవాలు మొదలయ్యాయని, తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణపయ్యకు పదో రోజు ఉత్తరపూజ చేసి నిమజ్జనం చేయాల్సిందేనని అన్నారు. బ్రాహ్మణ సంఘం నాయకులు కొండపాక శ్రీనివాస్‌, శ్రీనివాస్‌, నాగేశ్వరశర్మ, ఏసీపీ మహేశ్‌, సీఐ అనిల్‌ పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు వచ్చేనెల 30లోగా నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని కార్మిక సంఘాలు స్వాగతిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నికలు నిర్వహించాలని తాము పట్టుపడుతుండగా, సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఎన్నికలను వాయిదావేస్తూ వస్తోందన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం సకాలంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌ చేశారు. ఇప్పటికే అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇండస్ట్రియల్‌ రిలేషన్‌ దెబ్బతిందని అంటున్నాయి. ఈనెల 27న డిప్యూటీచీఫ్‌ లేబర్‌ కమిషనర్‌ సమక్షంలో నిర్వహించే సమావేశంలో షెడ్యూలు విడుదల చేయాలని నాయకులు కోరుతున్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

రామగుండం: పట్టణంలో ఈనెల 27న జరిగే గణేశ్‌ నిమజ్జన ఏర్పాట్లను అంతర్గాం మండలంలోని గోదావరి నది తీరాన్ని గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు సోమవారం పరిశీలించారు. నిమజ్జనం కోసం వచ్చే విగ్రహాల సంఖ్య, భద్రత ఏర్పాట్లు తదితర అంశాలపై సర్పంచ్‌తో చర్చించారు. రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్‌, అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్‌, విలేజీ అంతర్గాం సర్పంచ్‌ సతీశ్‌, ఉపసర్పంచ్‌ తమ్మనవేణి సంతోష్‌ పాల్గొన్నారు.

నేడు బీ-థర్మల్‌ కేంద్రానికి డైరెక్టర్ల రాక

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల బీ థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాన్ని వివిధ విభాగాల డైరెక్టర్లు మంగళవారం సందర్శిస్తారని సమాచారం. ఈనెల 12 నుంచి వార్షిక మరమ్మత్తుల కోసం షట్‌డౌన్‌ చేయగా విద్యుత్‌ ఉత్పత్తి నిలిచింది. సుమారు ఆరు దశాబ్దాల క్రితం నాటి విద్యుత్‌ కేంద్రం కావడంతో రెండేళ్లుగా తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. తాత్కాలికంగా పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్‌ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకుని విద్యుత్‌సౌధ నుంచి థర్మల్‌, సివిల్‌, హైడల్‌, కన్‌స్ట్రక్షన్‌ విభాగాల డైరెక్టర్లు విద్యుత్‌ కేంద్రం పరిశీలనకు వస్తారని తెలిసింది. పలు అంశాలు పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటారని సమాచారం.

డబుల్‌బెడ్రూమ్‌ ఇళ్లు ఇప్పించండి


కలెక్టరేట్‌ ఎదుట లబ్ధిదారుల నిరసన

పెద్దపల్లిరూరల్‌: తమకు డబుల్‌ బెడ్రూమ్‌ ఇళ్లు వెంటనే కేటాయించాలని లబ్ధిడిమాండ్‌ చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌ ఎదుట శనివారం నిరసన తెలిపారు. డ్రా పద్ధతిన ఎంపిక చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఇళ్లు ఎందుకు కేటాయించడం లేదని వారు ప్రశ్నించారు.

గ్రంథాలయాన్ని మార్చండి

పెద్దపల్లిరూరల్‌: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్‌ కాలేజీ భవన స్థలంలో విద్యార్థినుల కోసం కళాశాల భవనం నిర్మించాలని, గ్రంథాలయ భవనాన్ని మరోచోటుకు మార్చాలని నాయకులు తాండ్ర సదానందం, ముత్యంరావు, జూపాక శ్రీనివాస్‌, సీపెల్లి రవీందర్‌, ప్రశాంత్‌, స్టాలిన్‌, శివ, సాయి, మహేశ్‌ తదితరులు డిమాండ్‌ చేశారు. కలెక్టరేట్‌ ఏవో శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్‌: మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. నెల వేతనం రూ.6వేలకు పెంచాలని కోరారు.

అల్పాహారం.. అనేక సవాళ్లు!

- వచ్చేనెల 24 నుంచి సర్కారు బడుల్లో టిఫిన్‌
- ఆరురకాలతో విడుదలైన ప్రతిపాదిత మెనూ
- మానవ వనరులు, మౌలిక సదుపాయాలు పెరిగేనా?
- మిడ్‌ డే మీల్స్‌ సిబ్బందికి పెరగనున్న పనిగంటలు
- నిరంతర నిధులు అందాలంటున్న తల్లిదండ్రులు



ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	సర్కారు బడులు	విద్యార్థులు	వినియోగం	మిడ్‌డే స్టాఫ్‌
కరీంనగర్‌	652	49,754	44,502	1,134
పెద్దపల్లి	554	34,021	34,021	921
జగిత్యాల	783	77,050	72,050	1,475
సిరిసిల్ల	478	50,328	41,328	863
మొత్తం	2,467	2,11,153	1,91,901	4,393

నోట్‌: ఈ గణంకాల్లో స్వల్ప వ్యత్యాసం ఉండొచ్చు

సాక్షిప్రతినిధి,కరీంనగర్‌:

విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడేందుకు ఉద్దేశించిన అల్పాహారం పథకం అక్టోబర్‌ 24 నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు అందించే ప్రతిపాదిత మెనూ విడుదలైంది. విద్యార్థుల శారీరక శ్రేయస్సు, పోషకాహార లోపాన్ని నివారించేందుకు అమలు చేయనున్న ఈ పథకం ముందు కొన్ని సవాళ్లు ఉన్నాయి. ప్రస్తుతం కరీంనగర్‌, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలో ఈ పథకం అమలవుతున్నా 2,400కు పైగా పాఠశాలల్లో సిబ్బందికి పాత బకాయిలు, వేతన సవరణ, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. అదే సమయంలో సిబ్బంది, మౌలిక సదుపాయాలు పిల్లలకు అల్పాహారం పెట్టేందుకు సరిపోతాయా? అంటే.. చాలవంటూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అల్పాహారం అమలు నేపథ్యంలో మిడ్‌డే మీల్స్‌ సిబ్బందికి పనిగంటలు, వంట సమయం పెరుగుతాయని దీన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని వారికి సకాలంలో నిధులు విడుదల చేయాలని సూచిస్తున్నారు. ఒకవేళ మానవ వనరుల పెంపు సాధ్యం కాకపోయినా.. వారికి నిధుల విషయంలో లోటు రాకుండా చూసుకోవాలంటున్నారు.

రెండు లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ పథకం అమలైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే దాదాపు రెండు లక్షలకుపైగా విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థుల్లో పోషకాల కొరత నివారించడానికి ఉద్దేశించిన ఈ పథకంలో భాగంగా సోమవారం నుంచి శనివారం వరకు మినరల్స్‌, ప్రొటీన్లను సమతూకం చేసేందుకు ప్రత్యేకమైన మెనూను అనుసరించనున్నారు. అదే సమయంలో ఉమ్మడి జిల్లాలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం కోసం శ్రమిస్తోన్న సిబ్బందికి ఇకపై డబుల్‌ డ్యూటీలు అవనున్నాయి. గతంలో ఉదయమే వచ్చి కూరగాయలు, బియ్యం సిద్ధం చేసుకుని, మధ్యాహ్నం వేళకు అంతా భోజనం చేసేవారు. ఇప్పుడు ఉదయం 9 గంటలకల్లా సిబ్బంది విద్యార్థులకు అల్పాహారం సిద్ధం చేయాలంటే.. వీరంతా తెల్లవారక ముందే 5 గంటలకే పాఠశాల ప్రాంగణానికి చేరి పని మొదలు పెట్టాల్సి ఉంటుంది. ఈ లెక్కన సమయానికి విద్యార్థులకు అల్పాహారం అందాలంటే ఇప్పుడున్న మానవ వనరులు, నిధులు పెరగాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసరాలు, కోడిగుడ్ల ధరలకు ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలకు వ్యత్యాసం ఉంటోంది. అందుకే ఈ వ్యత్యాసాలు తగ్గించి మిడ్‌ డే మీల్స్‌ సిబ్బందిపై ఆర్థిక భారం తగ్గించాలని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వారికి వేతనంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్‌ వంటి సదుపాయాలు కల్పిస్తే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందని సూచిస్తున్నారు.

ప్లేటుకు ఎంత?

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతోన్న మిడ్‌ డే మీల్స్‌ కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది. విద్యార్థుల తరగతులను బట్టి ప్లేటుకు ఇంత అని నిర్ణయించింది. అవి ఇలా ఉన్నాయి? ఒకటి నుంచి 5వ తరగతి వరకు రూ.5.45 , 5 నుంచి 8వ తరగతి వరకు రూ.8.17, 9 నుంచి 10వ తరగతి వరకు రూ.10.19 చొప్పున చెల్లిస్తోంది. 1 నుంచి 8వ తరగతి వరకు గుడ్డు కోసం రూ.5.00 చెల్లిస్తోంది. కొత్త కరీంనగర్‌ జిల్లాలో ఏటా రూ.7.6 కోట్ల మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ లెక్కన నెలకు రూ.63.48 లక్షల వరకు ఖర్చవుతోంది. జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలో కాస్త అటూ ఇటూగా ఇంతే మొత్తం ఖర్చవుతుందని అంచనా. ఈ లెక్కన పాత జిల్లాలో దాదాపు రూ.50 కోట్ల వరకు మిడ్‌ మీల్స్‌ కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇక అల్పాహారం మొదలైతే.. ఇందులో కనీసం నాలుగో వంతైనా ఖర్చు చేయాల్సి వస్తుంది.

విద్యార్థులకు ప్రతిపాదించిన మెనూ ఇదే

- సోమవారం:గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ
- మంగళవారం:బియ్యం రవ్వ కిచిడి, చట్నీ
- బుధవారం:బొంబాయి రవ్వ ఉప్మా, సాంబార్‌
- గురువారం:రవ్వ పొంగల్‌, సాంబార్‌
- శుక్రవారం:మిల్లెట్‌ రవ్వ కిచిడి, సాంబార్‌
- శనివారం: గోధుమ రవ్వ కిచిడి, సాంబార్‌

పేద విద్యార్థులకు వరం



ప్రభుత్వం చేపట్టిన అల్పాహార పథకాన్ని ఆహ్వానిస్తున్నాం. ఆహారం తీసుకోకుండా బడికి వస్తున్న నిరుపేద విద్యార్థులకు ఈ పథకం వరం. ప్రస్తుతం పౌష్టికాహారం లోపంతో ప్రార్థన సమయంలోనే చాలా మంది పిల్లలు కిందపడిపోతున్నారు. ఈ పథకం అమలైతే ఇలాంటి బాధలుండవు. పథకాన్ని ప్రభుత్వం చిత్తశుద్ధితోని అమలు చేస్తూ నిరంతరం నిధులు విడుదల చేయాలి. మానవ వనరులు, మౌలిక సదుపాయాలు పెంచాలి.

– శనిగరపు రవి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

డేగకళ్లతో నిఘా

- గణేశ్‌ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు
- డీజే, మద్యపానానికి అనుమతి లేదు
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



గోదావరిఖని: వినాయక నిమజ్జనోత్సవానికి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్‌ రెమా రాజేశ్వరి తెలిపారు. బుధవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో సీపీ పలు విషయాలు వెల్లడించారు. కమిషనరేట్‌ పరిధిలో 4,253 విగ్రహాలు, జిల్లా వ్యాప్తంగా 2,272 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారని అన్నారు. విద్యుత్‌, మున్సిపల్‌, రెవెన్యూ శాఖల సమన్వయంతో నిమజ్జనం వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. దీనికి గణేశ్‌ మండప నిర్వాహకులు, ప్రజలు, భక్తులు సహకరించాలని పోలీస్‌ కమిషనర్‌ కోరారు.

సాక్షి : జిల్లాలో వినాయక నిమజ్జనం ఎప్పుడు జరుగుతుంది?

సీపీ : జిల్లాలో ఈనెల 27న వినాయక నిమజ్జనం నిర్వహిస్తారు.

సాక్షి : సున్నిత ప్రాంతాల్లో శోభాయాత్ర, నిమజ్జనం సాఫీగా సాగడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీపీ : వినాయక నవరాత్రులు, శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందుగా అన్నిమతాలకు చెందిన 300మంది పెద్దలతో శాంతి సమావేశం ఏర్పాటు చేశాం. సున్నిత ప్రాంతాల్లో శోభయాత్ర ప్రారంభం, నిమజ్జనం నిఘానేత్రాల నీడలో కొనసాగుతుంది.

సాక్షి : జిల్లాలో గుర్తించిన నిమజ్జన స్థలాలు?

సీపీ : పెద్దపల్లిలో మినీ ట్యాంక్‌బండ్‌(ఎల్లమ్మ చెరువు), సుల్తానాబాద్‌లో చెరువు, గోదావరిఖని పరిధిలోని విగ్రహాల నిమజ్జనం కోసం గోదావరి వంతెన, అంతర్గాం మండలంలోని గ్రామాల గణనాథులను గోలివాడ గోదావరి నది, మంథని, సమీప ప్రాంతాల విగ్రహాలను మంథని గోదావరి తీరం, ఓడేడ్‌ వద్ద మానేరు, గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జన స్థలాలు గుర్తించాం.

సాక్షి : బందోబస్తుకు ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు?

సీపీ : వినాయక శోభాయాత్ర మొత్తం నిఘా నేత్రాలు(సీసీ కెమెరాల) పర్యవేక్షణలో కొనసాగుతుంది.

సాక్షి : జిల్లాలో ఎంతమంది పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తున్నారు?

సీపీ : పెద్దపల్లి డీసీపీ, ఇద్దరు ఏసీపీల తోపాటు ఆయా పోలీస్‌స్టేషన్ల పోలీసు అధికారులతోపాటు సుమారు 450 మంది పోలీసు బలగాలను బందోబస్తుకు వినియోగిస్తున్నాం.

సాక్షి : అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకునే చర్యలు?

సీపీ : ముందుగానే సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, పికెట్ల ఏర్పాటు, శోభయాత్ర సందర్భంగా విగ్రహాల ముందు, వెనకాల ఎస్కార్ట్‌, పెట్రోలింగ్‌ ఏర్పాటు చేశాం.

సాక్షి : విద్యుత్‌ ప్రమాదాల నియంత్రణ ఎలా సాధ్యం?

సీపీ : శోభాయాత్ర నిర్వహించే మార్గాల్లో ప్రమాదకర విద్యుత్‌ తీగలు గుర్తించాం. చర్యలు తీసుకోవాలని విద్యుత్‌, రోడ్లు, భవనాల శాఖ అధికారులకు సూచించాం. అత్యవసర పరిస్థితుల్లో శోభాయాత్ర దారి మళ్లించడానికి ఏర్పాట్లు చేశాం.

సాక్షి : నిమజ్జనం కోసం ఏయే శాఖల సహకారం తీసుకుంటున్నారు?

సీపీ : మున్సిపల్‌, విద్యత్‌ శాఖ, రెవిన్యూ శాఖ, తదితర ప్రభుత్వ శాఖల సహకారం తీసుకుంటున్నాం.

సాక్షి : నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

సీపీ : గోదావరి నదిలో ప్రత్యేకంగా బోట్లు ఏర్పాటు చేస్తున్నాం. గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నాం. నిమజ్జన ప్రాంతాల్లో ట్రాఫిక్‌ నిబంధనలు విధిస్తున్నాం. రాత్రిపూట ఇబ్బంది కలుగకుండా విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేస్తున్నాం. సింగరేణి సహకారంతో భారీవిగ్రహాల నిమజ్జనం కోసం పెద్ద క్రేన్లు తెప్పిస్తున్నాం.

సాక్షి : డీజే, మద్యం నియంత్రణకు చర్యలు ఏమిటి?

సీపీ : శోభాయాత్రలో డీజే సౌండ్స్‌కు అనుమతి లేదు. మద్యం నియంత్రణ కోసం వైన్స్‌ మూసివేయాలని కలెక్టర్‌ ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు.

ఓటరు జాబితాలో పొరపాట్లు ఉండొద్దు

- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి
- రోల్‌ అబ్జర్వర్‌ సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌


మాట్లాడుతున్న అబ్జర్వర్‌ సుదర్శన్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్‌/జ్యోతినగర్‌/కోల్‌సిటీ: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం పకడ్బందీ ఓటరు జాబితా రూపొందించాలని ఎలక్షన్‌ రోల్‌ అబ్జర్వర్‌ సుదర్శన్‌ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌, అడిషనల్‌ కలెక్టర్‌ అరుణశ్రీతో కలిసి మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు. పోలింగ్‌ కేంద్రాలవారీగా ఎక్కువగా నమోదైనా.. తొలగించిన వాటిపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ఈనెల 15లోగా నమోదైన ఓటర్లకు గుర్తింపుకార్డులు అందేలా చూడాలన్నారు. అనంతరం పట్టణంలోని ఇండియా మిషన్‌ సెకండరీ స్కూల్‌లోని పోలింగ్‌ కేంద్రాన్ని సందర్శించి బూత్‌స్థాయి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్టీపీసీ రామగుండంలోని సెయింట్‌ క్లేర్‌ పాఠశాల, గోదావరిఖని, విఠల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాలనూ ఆయన సందర్శించి పలు సూచనలుచేశారు.

జిల్లాలో 6.99లక్షల మంది ఓటర్లు..

జిల్లాలో ఇప్పటివరకు 6,99,580 మంది ఓటర్లు పేర్లు నమోదు చేసుకున్నారని కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ తెలిపారు. జిల్లాలో పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, తుది ఓటరు జాబితా సమయానికి ఓటర్ల సంఖ్య 7లక్షలు దాటే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 837 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేసి బూత్‌స్థాయి అధికారులను నియమించామని, మరో 83మంది సూపర్‌వైజర్లతో పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్‌ వివరించారు. ఆర్డీవోలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ మాటలు నమ్మి మోసపోవద్దు


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దాసరి

కాల్వశ్రీరాంపూర్‌: కాంగ్రెస్‌ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. వెన్నంపల్లిలో ఎమ్మెల్యే సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. పెగడపల్లిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా అమలు చేయని సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్‌ రాష్ట్రంలో అమలుచేస్తోందన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్‌ యాదవ్‌, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, నాయకులు దేవయ్య, రాజకొమురయ్య ఉన్నారు.

2 నుంచి పంచాయతీ కార్మికుల సమ్మె

పెద్దపల్లిరూరల్‌: తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, అందుకే అక్టోబర్‌ 2నుంచి నిరవధిక సమ్మె చేస్తామని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు ముత్యంరావు తెలిపారు. ఈమేరకు సంబంధిత శాఖ అధికారులకు సమ్మె నోటీసు అందించామని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలిపామని అన్నారు. నాయకులు లచ్చయ్య, శ్రీనివాస్‌, దేవేందర్‌, భాస్కర్‌, గౌసొద్దీన్‌, చంద్రయ్య, ప్రేంకుమార్‌, రమేశ్‌, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

డీజే హోరు తప్పేనా?

- సుల్తానాబాద్‌ మండలంలోని ఓ గ్రామంలో గతేడాది గణేశ్‌ నిమజ్జనం సందర్భంగా భారీసౌండ్స్‌ ఏర్పాటు చేశారు. ఆ శబ్దానికి తట్టుకోలేక ఓ వృద్ధుడు గుండెపోటుకు గురవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో త్రుటిలో ప్రాణపాయం తప్పింది.

- జిల్లాలోని ఓ రాజకీయ పార్టీ ఇటీవల చేపట్టిన ర్యాలీలో డీజే సౌండ్స్‌ ఏర్పాటు చేసింది. పెద్దపల్లి టౌన్‌కు చెందిన ఓ యువకుడు ఆ శబ్దాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇంటికి చేరుకున్న కాసేపటికే గుండెనొప్పితో కుప్పకూలాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందాడు. అంతకుముందు గుండె సంబంధింత సమస్యలేమీ లేవని కుటుంబ సభ్యులు తెలిపారు.

- లౌడ్‌ స్పీకర్లకు అడ్డుకట్ట పడేనా?
- గ్రామాల్లో యథేచ్ఛగా వినియోగం
- రాత్రివేళ పల్లెవాసుల ఇష్టారాజ్యం
- ఇబ్బందుల్లో వృద్ధులు, గర్భిణులు
- గుండెవ్యాధిగ్రస్తులకు తప్పని తిప్పలు



సాక్షి, పెద్దపల్లి: చిన్నవయసులోనే కొందరు ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందుతున్నారు. మరికొందరు మృత్యువు అంచువరకూ వెళ్లి వస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు.. ఇలా అందరూ తీవ్రప్రభానికి లోనవుతున్నారు. మితిమీరిన వ్యాయామం, ఫిట్నెస్‌ కోసం గుండె సామర్థ్యాన్ని మించి కష్టపెట్టడం, నిద్ర లేమి, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి తదితర కారణాలతోపాటు భారీ శబ్దాలను విడుదల చేసే డీజే సౌండ్స్‌, లౌడ్‌ స్పీకర్స్‌తో చిన్నవయ వారు కూడా గుండెపోటుకు గురవుతున్నటు వైద్యనిపుణులు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా మనిషికి 80 డెసిబుల్స్‌ కంటే తక్కువ శబ్దాలతో ఇబ్బందులు ఉండవు. 80నుంచి 130డెసిబుల్స్‌ వరకు డేంజర్‌ జోన్‌లో ఉన్నట్లు, అంతకుమించితే గుండె వేగం పెరిగి వినికిడి శక్తి కోల్పోతారని అంటున్నారు. అధిక శబ్దాన్ని తట్టుకోలేని వారు ప్రాణప్రాయ స్థితికి చేరుకుంటారని, సాధారణ ప్రజల కంటే గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు డీజే సౌండ్స్‌తో గుండెపోటుకు గురయ్యే అవకాశాలు మూడురెట్లు ఎక్కువని వైద్యులు చెబుతున్నారు.

నిషేధం అమలులో ఉన్నా..

- రామగుండం కమిషనరేట్‌ పరిధిలో డీజేలపై నిషేధం అమలులో ఉంది.
- పట్టణాలు, మండల కేంద్రాల్లో పోలీసుల నిఘాతో డీజేలు లేకుండా వినాయక నిమజ్జనోత్సవాలు సజావుగా జరుగుతున్నాయి.
- కానీ, గ్రామాల్లో పోలీసుల నిఘా అంతగా ఉండదు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు డీజే సౌండ్స్‌తోనే నిమజ్జనోత్సవాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.
- కేవలం నిమజ్జనం వేళ మాత్రమే కాకుండా వివాహ, శుభకార్యాలు, రాజకీయ పార్టీల కార్యక్రమాలు, ర్యాలీల సందర్భంగా డీజే సౌండ్స్‌ వినియోగిస్తున్నారు.

అధిక శబ్దంతో గుండెదడ



ఉలిక్కిపాటుకు గురిచేసే శబ్దంతో హార్ట్‌బీట్‌ పెరుగుతుంది. మెదడులో స్ట్రెస్‌ హార్మోన్స్‌ వృద్ధి చెంది గుండెపోటుకు దారితీస్తుంది. తద్వారా భారీ శబ్దాలతో గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. భారీ శబ్దాల సమయంలో చెవిలో బడ్స్‌, దూది లాంటివి పెట్టుకోవాలి.

– అశోక్‌, హెచ్‌వోడీ, జనరల్‌ మెడిసిన్‌, గోదవరిఖని

అనుమతి లేదు



జిల్లాలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం చేసుకోవాలి. శోభాయాత్రల్లో డీజేలు, భారీ లౌడ్‌ స్పీకర్లకు అనుమతి లేదు. ఎవరైనా హద్దుమీరి ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

–వైభవ్‌ గైక్వాడ్‌, డీసీపీ

క్లుప్తంగా

బీసీ సెల్ జిల్లా కార్యదర్శి నియామకం



ఉత్తర్వులు అందిస్తున్న మక్కాన్‌సింగ్

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామానికి చెందిన నక్క జ్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు సోమవారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

మహిళా పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలి



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: గోదావరిఖనిలో మహిళా పోలీస్‌స్టేషన్ త్వరగా ఏర్పాటు చేయాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీని కోరారు. హైదరాబాదులో హోంమంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందుకు హోంమంత్రి సానుకులంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ సాగంటి శంకర్, నారాయణదాసు మారుతి, గౌస్‌పాషా తదితరులు ఉన్నారు.

స్వామికి సేవారత్న అవార్డు



స్వామిని అభినందిస్తున్న జస్టిస్ చంద్రయ్య

రామగిరి: జిల్లా భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామికి సేవారత్న అవార్డును సోమవారం రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రయ్య అందించారు. హైదరాబాద్ శాంతి ఆడిటోరియంలో ఎలర్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్, ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి అవార్డు అందించి సన్మానించారు.

కటికనపల్లి సర్పంచ్‌కు జాతీయ పురస్కారం



ఆహ్వానపత్రం అందుకుంటున్న రాజయ్య

ధర్మారం: కటికెనపల్లి సర్పంచ్ కారుపాకల రాజయ్యను బహుజన సాహిత్య అకాడమీ జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికచేసింది. అక్టోబరు 15న ఢిల్లీలో జరిగే నాలుగో జాతీయ కాన్ఫరెన్స్‌లో సర్పంచ్‌కు అవార్డు అందిస్తారని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆహ్వాన పత్రం అందించామని వివరించారు.

చీకట్లో నగర రహదారులు

- ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు
- మరుగునపడిన వీధిదీపాలు
- 27న గణేశ్ నిమజ్జనం
- పూర్తికాని మరమ్మతులు

రామగుండం కార్పొరేషన్ సమాచారం	
విస్తీర్ణం(చ.కి.మీ.లలో)	93.87
జనాభా(లక్షల్లో)	2.69
వీధిదీపాలు	19,273
వీధిలైట్ల విస్తీర్ణం(చ.కి.మీ.లలో)	80.03



స్ట్రీట్‌లైట్లను కమ్మేసిన కోనోకార్పస్ చెట్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలోని రహదారులు చికట్లను తలపిస్తున్నాయి. ఎనర్జీ సేవింగ్ పేరిట 2017 నుంచి ఎల్‌ఈడీ లైట్ల వినియోగానికి ఈఈఎస్‌ఎల్ సంస్థకు ఏడేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నా మరమ్మతులు చేపట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు కార్పొరేషన్ అధికారులు కూడా మొక్కుబడిగా పర్యవేక్షిస్తున్నారని విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈనెల 27న గణేశ్ నిమజ్జ వేడుకల నిర్వహణకు ఇటీవల అన్నివిభాగాల అధికారులతో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ సమీక్షించారు. వీధిదీపాల నిర్వహణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాని ఆదేశించారు. నిజ్జనానికి ఇంకా రెండు రోజులే ఉన్నా.. మరమ్మతులు ముందుకు సాగడం లేదు.

- గోదావరిఖనిలోని రాజేశ్ థియేటర్ కూడలి, మార్కండేయ కాలనీ, గాంధీనగర్ ప్రధాన రహదారులు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడలి, గాంధీచౌక్ చౌరస్తా నుంచి కూరగాయల మార్కెట్ ప్రధాన రహదారి, సింగరేణి ఏరియా ఆస్పత్రి ప్రధాన రహదారి, అశోక్‌నగర్ కూడలి, గంగానగర్ ప్రధాన రహదారితోపాటు ఫోర్‌లేన్‌లోని సర్వీస్ రోడ్లపై వీధిదీపాల్లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తున్నాయి.

చెట్ల కొమ్మల్లో స్ట్రీట్‌లైట్లు..

- డివైడర్ల మధ్య ఎత్తుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లలో వీధిదీపాలు చిక్కుకున్నాయి. రాత్రిళ్ల వెలుతురు కనిపించడంలేదు. స్ట్రీట్‌లైట్ల స్తంభాల ఎత్తుకు మించి చెట్లు పెరిగాయి. కొమ్మలు గుబురుగా ఉన్నాయి. ఇందులోని వీధిదీపాలు కనిపించడంలేదు. రాత్రిళ్ల ఈ ప్రాంతాల్లో చిమ్మని చీకటి అలముకుంటోంది. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- మార్కండేయకాలనీ, సింగరేణి ఏరియా ఆస్పత్రి రహదారిపైనా చీకట్లు కమ్ముకున్నాయి. అధికారులు ఈ చెట్ల కొమ్మలకు ట్రిమ్మింగ్ చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నిర్లక్ష్యం వీడాలి



స్ట్రీట్‌లైట్లకు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదు. చీకట్లో రోడ్డు ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. నిమజ్జనం దగ్గర పడుతున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడం సరికాదు. తక్షణమే నిర్లక్ష్యం వీడాలి.

– నూతి సురేశ్‌కుమార్, అడ్వకేట్

ఏర్పాట్లు చేస్తున్నాం



నిమజ్జన వేడుకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. వీధిలైట్ల ఏర్పాట్లకు ప్రత్యేకంగా టెండరు కూడా పిలిచి పనులు చేపట్టాం. రాత్రిళ్ల పర్యవేక్షణ చేసి, వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. సాఫీగా వేడుకలు నిర్వహిస్తాం.

– నాగేశ్వర్, కార్పొరేషన్ కమిషనర్

ప్రాణానికి ముప్పు ఉన్నా..

- ప్రజాసేవకే అంకితం
- ఆశీర్వాద యాత్రలో ఎంపీ వెంకటేశ్
- పుట్ట మధును ఆశీర్వదించాలని విన్నపం



మాట్లాడుతున్న పుట్ట మధు, ఎంపీ వెంకటేశ్

ముత్తారం: తన ప్రాణాలకు ముప్పు ఉందని ఇంటలిజెన్స్ హెచ్చరించినా జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ప్రజాసేవకే అంకితమని ప్రజాఆశీర్వాద యాత్ర చేపట్టారని, ఆయనను మంథని ఎమ్మెల్యేగా మళ్లీ గెలిపించాలని ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత కోరారు. బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు మండల కేంద్రంలో ప్రజా ఆశీర్వాదయాత్ర ప్రారంభించారు. ఎంపీ వెంకటేశ్ నేత, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటున్న మధుకు ప్రతిపక్షం, అసమ్మతి నాయకులు టికెట్ రావొద్దని బెదిరించారని, అయినా గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో గెలిచారని అన్నారు. మధుకు 50వేల మెజార్టీ వస్తుందని సీఎం కేసీఆర్ సర్వేలో తేలిందని తెలిపారు. అనంతరం మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు మాట్లాడుతూ, బహుజన బిడ్డను అయిన తనను చంపడానికి కుట్రలు పన్నుతున్నవారికి ఓట్లతో బుద్ధి చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ప్రజా ఆశీర్వాదయాత్రను సెంటిమెంట్‌గా ముత్తారం నుంచి ప్రారంభించామని తెలిపారు. గతంలోనూ ముత్తారం మండలం లక్కారం నుంచే పాదయాత్ర ప్రారంభించామని గుర్తుచేశారు. కాగా, ప్రజాఆశీర్వాద యాత్ర ముత్తారం నుంచి అడవిశ్రీరాంపూర్ మీదుగా ఖమ్మంపల్లి చేరుకుంది. ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, జెడ్పీటీసీ చెలుకల స్వర్ణలత, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ నూనె కుమార్, రైతుబంధు సమితి అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, పీఏసీఎస్ చైర్మన్లు కొత్త శ్రీనివాస్, రాజిరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

సుల్తానాబాద్‌రూరల్: పూసాలకు చెందిన పోలుదాసరి కొంరయ్య(72) సోమవారం మృతి చెందాడు. ఎస్సై విజేందర్ కథనం ప్రకారం.. ఇరవై ఏళ్ల క్రితం భార్య కనకమ్మ మృతి చెందింది. వీరికి ముగ్గురు కుమారులు. ఉపాధి రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. కొంరయ్య ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం వరకూ ఇంటి తలుపులు తీయలేదు. స్థానికులు అనుమానంతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత తలుపులు పగులకొట్టి చూడగా కొంరయ్య మంచంపై విగత జీవిగా కనిపించాడు. గుండెపోటు లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే అనుమానంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

ఆలిండియా అధ్యక్షునికి తీర్మానపత్రం అందజేత

గోదావరిఖని: ఐఎన్‌టీయూసీ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాన్ని ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డికి సోమవారం అందజేశారు. రామగుండం నియోజకవర్గం నుంచి ఐఎన్‌టీయూసీ తరఫున జనక్‌ప్రసాద్‌కు టికెట్ ఇవ్వాలని, లేనిపక్షంలో సింగరేణిలోని 12 ఏరియాల్లో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సహాయ నిరాకరణ చేస్తామన్న విషయాన్ని సంజీవరెడ్డికి వివరించారు. జనక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు సత్యజిత్‌రెడ్డి, చంద్రశేఖర్, గుమ్మడి కుమారస్వామి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య తదితరులు ఉన్నారు.

బీజేపీ సర్కార్ ఏర్పాటు ఖాయం

- పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పెద్దపల్లిరూరల్: కేంద్రంలో నీతివంతమైన పాలనను అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ పాలనను చూసి వచ్చేఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి అధికారాన్ని అప్పగించాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. పట్టణంలో సోమవారం బూత్ అధ్యక్షుల సమావేశం జరిగింది. జన సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, మేకల శ్రీనివాస్, రాజంమహంత, రమణారావు, నాగరాజు శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, అంజి, సాగర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ ఇవ్వండి

ధర్మారం:ధర్మపురి నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నుంచి తనకు టికెట్ ఇవ్వాలని ధర్మారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొల్లి స్వామి కోరారు. ఈమేరకు న్యూఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను సోమవారం కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కనుకట్ల శేఖర్, పాములపర్తి తిరుపతి, నగమల్ల రోహిత్, కాంపెల్లి వినయ్, రామగిరి యధి ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: రాబోయే ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధంగా ఉండాలని ఎన్నికల రాష్ట్ర ప్రధాన అధికారి వికాస్‌రాజ్, జాయింట్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు. సోమవారం కలెక్టర్లతో వారు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఓటరు జాబితా సవరణ, గుర్తింపుకార్డుల జారీపై దృష్టిసారించాలన్నారు. అనంతరం జిల్లాలోని అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. దివ్యాంగులు, మహిళల కోసం ప్రత్యేకంగా మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించాలని సూచించారు. జూలై 15నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు.

'అవి మోసపూరిత హామీలు'

ఓదెల(పెద్దపల్లి): బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు విమర్శించారు. ఉప్పరపల్లెలో సోమవారం గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్యారంటీ పథకాలు పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, నాయకులు బైరి రవిగౌడ్, పుప్పాల శంకర్, పిట్టల రవికుమార్, పెద్దస్వామి, చిన్నస్వామి, రాజయ్య, అయోధ్య నారాయణ, చిలుక హరికాంత్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సమీక్ష

గోదావరిఖని: ప్రమాదాల నివారణకు నిరంతర సమీక్ష అవసరమని మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ(డీడీఎంఎస్) వెంకన్న సూచించారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లో రక్షణ చర్యలపై సోమవారం సమీక్షించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలపై విస్తృత ప్రచారం

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్:కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామనే అంశాలపై ఊరూర, వాడవాడన విస్తృతంగా ప్రచారం చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు పార్టీ శ్రేణులకు సూచించారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బిరుదురాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్యతో కలిసి మాట్లాడారు. మహిళల కోసం మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతులకోసం రైతుభరోసా, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, యువతకు యువవికాసం, చేయూత లాంటి పథకాలకు రూపకల్పన చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తూ పెద్దపల్లిపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.సురేశ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, అన్నయ్య, మల్లయ్య, సారయ్య, ప్రకాశ్‌రావు, కోట శ్రీనివాస్, దామోదర్‌రావు, సంతోష్, మహేందర్, చెవుల తిరుపతి, తూముల సుభాష్, నెత్తెట్ల కుమార్, ఎడెల్లి శంకర్, అస్లాం, శోభ, ఈర్ల స్వరూప పాల్గొన్నారు.

కెనడాలో రామగుండంవాసి మృతి

రామగుండం: పట్టణానికి చెందిన ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగి సయ్యద్ అతహుల్లా(70) కెనడా దేశంలో ఈనెల 20న గుండెపోటుతో మృతిచెందాడు. తన కుమారుడు అతిక్‌పాషా కుటుంబ సభ్యులతో పదిహేనేళ్ల క్రితమే అక్కడ స్థిరపడ్డారు. కరోనా సమయంలో అతహుల్లా భార్య షహానాబేగం మృతిచెందింది. దీంతో కెనడాలోని తన కుమారుడి వద్దకు మూడేళ్లక్రితం వెళ్లిన అతహుల్లా.. గుండెపోటుతో మృతిచెందాడు. మృతదేహానికి రామగుండంలోనే దహన సంస్కారాలు చేసేందుకు తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు బంధువులు తెలిపారు. ప్రస్తుతం కెనడాలో జరుగుతున్న గొడవలతో మృతదేహం తరలింపులో జాప్యం జరుగుతోంది.

మట్టి తరలుతున్నా పట్టించుకోరా?

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గంలోని సహజవనరులను అక్రమంగా దోచుకుపోతున్నా అధికార యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ప్రశ్నించారు. ఎలిగేడు మండలం శివపల్లి శివారు బోడగుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలింపును అడ్డుకుంటేనే అధికారులు స్పందించారని తెలిపారు. మైనింగ్ అధికారుల అనుమతిలేకుండా మట్టి, ఇసుక తరలుతున్నాయని తెలిసినా పట్టించుకోకపోవడంతో సహజసంపద మాయమవుతోందని అన్నారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోందన్నారు.

బొగ్గుబాయి వార్తలు

నిరంతరంగా బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తికి ఆటంకంలేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. సోమవారం జీడీకే–5 ఓసీపీ సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణపై అధికారులతో చర్చించారు. కోల్‌బెంచ్ పనిస్థలాలు, ప్రీవేబిన్, అండర్ గ్రౌండ్ గ్యాలరీల్లో పని విధానాలు పరిశీలించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రణాళిక గురించి సూచనలు, సలహాలు చేశారు. భారీవర్షాల నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జీఎం వెంట ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, ఇంజినీరు ఎస్‌వీరావు, మేనేజర్ అనిల్‌గబాలే, సేఫ్టీ అధికారి పాల్గొన్నారు.

ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో అన్నదానం

గణేశుని నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆర్జీ–1 జీఎం కార్యాయలంలో అన్నదానం నిర్వహించారు. జీఎం చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమం ప్రారంభించారు. సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, సేఫ్టీ జీఎం సాంబయ్య, క్వాలిటీ జీఎం కేవీరావు, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సివిక్ జోన్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వాటా చెల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు వేముల రమేశ్, దుర్గం బాబు, దుర్గేశ్, లింగయ్య, నరేశ్, రాజయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ

గోదావరిఖని: భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలపాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. రూ.4.52కోట్లతో కొనుగోలు చేసిన నూతనషా వల్ ఆయన సోమవారం ప్రారంభించి గంగా అని దానికి నామకరణం చేశారు. జీఎం మాట్లాడుతూ షావల్ సామర్థ్యం 6.5 క్యూబిక్ మీటర్లన్నారు. ఉద్యోగులపై నమ్మకంతో యాజమాన్యం భారీ యంత్రాలు కొనుగోలు చేస్తోందని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, గని మేనేజర్ రమేశ్, ప్రాజెక్టు ఇంజినీర్ రాజాజీ, బేస్‌వర్క్‌షాప్ ఏఈ రామకృష్ణ, షావెల్ ఎస్‌ఈ జనార్దన్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహ్మద్, సంక్షేమాధికారి సురేందర్, యూనియన్ నాయకులు ఐలి శ్రీనివాస్, రవీందర్, సత్యనారాయణ, దావు రమేశ్, ఉల్లి మొగిలి, మార్కండేయ పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ఆర్జీ–1 ఏరియా జట్టు



క్రీడాకారులతో అధికారులు

గోదావరిఖని: ఇంటర్ ఏరియా కబడ్డీ పోటీల విజేతగా ఆర్జీ–1 ఏరియా జట్టు నిలిచింది. ఆర్జీ–1, 2 జట్ల మధ్య సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కబడ్డీ పోటీలు నిర్వహించగా ఆర్జీ–1 జట్టు గెలుపొందినట్లు అధికారులు తెలిపారు. విజేతలకు ఏరియా ఇంజినీర్ రాంమూర్తి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ గౌరవ కార్యదర్శి బంగారు సారంగపాణి, సూపర్ వైజర్ రమేశ్, కో ఆర్డినేటర్ రాజయ్య పాల్గొన్నారు.

ఓసీపీ–3లో త్రుటిలో తప్పిన ప్రమాదం

గోదావరిఖని:సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధి ఓసీపీ–3లో ప్రైవేట్ లోడర్ కోల్‌బంకర్‌లోకి దూసుకెళ్లింది. ఆపరేటర్ ప్రమాదాన్ని పసిగట్టి అందులోంచి దూకడంతో ప్రమాదం తప్పింది. బంకర్‌లో ఫైర్‌కోల్ ఉండటంతో లోడర్ మరింత ముందుకు పడి ఉంటే పూర్తిగా కాలిపోయేదని పేర్కొన్నారు. ఆపరేటర్ అదృష్టవశాత్తు అందులోంచి దూకి బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. లారీల ద్వారా బంకర్‌లో డంప్ చేయాల్సిన బొగ్గును లోడర్ ద్వారా చేయిస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనం అదుపుతప్పినా బంకర్‌లోకి వాహనం వెళ్లకుండా నిరోధించే రిటర్నింగ్ వాల్స్ లేకపోవడం కూడా ప్రమాదానికి కారణమని అంటున్నారు. ఓసీపీ–3లో గతంలో జరిగిన ప్రమాదంపై డీడీఎంఎస్ అధికారి విచారణ చేపడుతున్న క్రమంలో ఈప్రమాదం జరగడంపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫొటోషూట్‌కు వెళ్లి వస్తుండగా..

- యువతి మెడలో బంగారుహారం చోరీ
- చైన్‌స్నాచర్ ఫొటోలు విడుదల చేసిన పోలీసులు

గోదావరిఖని: ఫొటో షూట్‌కోసం వెళ్లివస్తున్న యువతి మెడలోని బంగారుహారాన్ని దొంగ ఎత్తుకెళ్లాడు. కోరుట్లకు చెందిన వేముల అరుణ్‌కుమార్ గౌతమినగర్‌లో అత్తగారింటి వద్ద ఉంటున్న తన భార్యవద్దకు వచ్చాడు. ఈక్రమంలో సోమవారం ఫొటో షూట్‌కోసం విఠల్‌నగర్‌పార్క్‌కు ఇద్దరూ వెళ్లారు. ఫొటోషూట్ అనంతరం బైక్‌పై తిరిగి వెళ్తున్న క్రమంలో సంజయ్‌గాంధీనగర్ వద్ద బైక్ వెనకాలే మరో బైక్‌పై వచ్చిన ముసుగు ధరించిన అగంతకుడు.. 'మీ కూతురు కాలిచెప్పు పడిపోయింది' అని చెప్పాడు. దీంతో బైక్ నిలిపి అరుణ్‌కుమార్.. చెప్పుకోసం వెళ్తున్న క్రమంలో మహిళ మెడలోని 10తులాల బంగారు హారాన్ని దొంగ తెంపుకుని పరారయ్యాడు. వన్‌టౌన్ రెండో సీఐ ప్రసాదరావు కేసు నమోదు చేసుకున్నారు. బైక్‌పై వచ్చిన అగంతకుని ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. అనుమానితుడిని గుర్తించి తెలిస్తే వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, 87126 56516 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సారూ.. వినతులివిగో.. పరిశీలించండి.. పరిష్కరించండి

- ప్రజావాణికి అభాగ్యుల విన్నపాలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం చూపాలని సోమవారం ప్రజావాణి ద్వారా కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీధర్‌కు విన్నవించారు. తనఆస్తి పంచి ఇవ్వాలని కుమారులు తనను ఇబ్బంది పెడుతున్నారని, వారిపేరిట చేసిన రిజిస్ట్రేషన్ రద్దు పరచి తన పేరిట ఉండేలా చూడాలని సుల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన పసుల మల్లయ్య విన్నవించుకున్నాడు. ఇలాంటి దరఖాస్తులను పరిశీలించిన కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్.. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

న్యాయం చేయండి



మాది సుల్తానాబాద్ మండలం కనుకుల. నలుగురు కొడుకులు, ఓ బిడ్డ సంతానం. పెద్ద కొడుకు రాజేశం ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. మిగిలినవారు స్వామి, రవి, సత్యనారాయణ కరోనాతో 15రోజుల వ్యవధిలో చనిపోయింద్రు. మాకున్న భూమి అమ్మి చిన్నకొడుకు సత్యనారాయణకు సింగరేణి ఉద్యోగం ఇప్పించేందుకు రూ.15లక్షల దాకా ఖర్చుచే చేసినం. నా కొడుకు ఉద్యోగం చేస్తున్న మా కోడలు.. మమ్మల్ని మెడపట్టి ఇంటి నుంచి బయటకు గెంటి వేసింది. మా కొడుకు లేడు. సింగరేణి ఇచ్చిన పరిహారమైనా మాకు ఇప్పించండి.

–ముత్యాల లింగయ్య, లక్ష్మి దంపతులు

ఆన్‌లైన్‌లో రావడంలేదు



నేను కష్టపడ్డ సొమ్ముతో కొనుగోలు చేసిన ఎకరం పది గుంటల భూమికి పాత పాసు బుక్కు ఉంది. ధరణి వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదుకాక రైతుబంధు, రైతుభీమా వర్తించడం లేదు. ఆన్‌లైన్‌లో పేరు వచ్చేలా చూడాలి.

–శ్రీనివాస్, కాచాపూర్

వడ్లపైసల్లో కోత పెట్టింద్రు



వడ్లు అమ్మిన పైసల్లో రూ.36వేల దాకా కోత పెట్టింద్రు. తక్కువ అచ్చినయని బ్యాంకు సార్లను అడిగితే.. కలెక్టరాఫీసుకు పొమ్మన్నరు. ఇప్పటికీ పైసలు వాపసురాలే. ఇప్పించి న్యాయం చేయాలె.–తాండ్ర దుర్గయ్య, పోచమ్మ, కాల్వశ్రీరాంపూర్

పింఛన్ ఇప్పించండి

పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న. లిస్టులో పేరు వచ్చిందన్నరు. కానీ, నాకు పింఛన్ పైసలు ఇత్తలేరు. మండలాఫీసు చుటూ తిరిగినా ఎవలు పట్టించుకుంటలేరు. నాకు పిఛన్ ఇప్పించి న్యాయం చేయాలె.

–సుశీల, బ్రాహ్మణపల్లి, అంతర్గాం మండలం

